కథానిక :

# ★ ఎదురుదెబ్బ

రచన :
శ్రీ ముద్దంశెట్టి హనుమంతరావు

గోడగడియారం తొమ్మిది గంటలు కొట్టింది. శారద గుండెలు "టక్ టక్" కొట్టుకుంటున్నాయి. ప్రతి గడియారం గంటా, ఓ సమ్మెట పెట్టులా తగిలాయి. మెయిలు వచ్చే వేళయింది. ప్రకాశం వస్తాడు... శారదలో ఆలోచనల తరంగాలు ఒక్కొక్కటీ లేస్తున్నాయి. రెండేళ్ళ క్రితం దూరదేశంపోయి, యీ నాటికి తిరిగివస్తున్న ప్రకాశం, దాదాపు క్రొత్త వాడిలానే అగుపిస్తాడు. శారీరకంగాకూడా కొంతమార్పు వచ్చేవుంటుంది. తనని చూడాలన్న కుతూహలంతో, పుత్సాహంతో వస్తాడు గామోసు... కాని.... కాని... అతణ్ణి యెలా పలుకరించడం? ఎలా అతనికి మొహంచూపించడం? తను నిర్లిప్తంగా, నిరుత్సాహంగావుంటే, అతను యేమనుకుంటాడు? మనసులో యెంతగా బాధపడతాడో? కాని, యేం చెయ్యను? అస్వాస్థ్యమైన మనసుని యెలా స్వాధీనంలోకి తీసుకురావడం?.... యీ ఆలోచనల తాకిడికి, శారద తట్టుకోలేకపోయింది. వికలమైన మనస్సుకి ఊరట కలిగించలేకపోయింది. బరువెక్కిన హృదయంతో కుర్చీలో వెనక్కి చేరబడింది.

బైట కారు హారన్ మ్రోగింది. శారద త్రుళ్ళి పడింది. ఆమె గుండెల్లో దడ బైలుదేరింది. బైటికి వెళ్లాలనుకుంది, కాని, అవ్యక్తమైన శక్తియేదో ఆపేసింది. ధైర్యం చాలక ఆగిపోయింది.

ప్రకాశం కారులోంచి ఉత్సాహంగా దిగాడు. శారద తండ్రి గంగాధర్రావు కూడా దిగాడు, ప్రకాశం ఓసారి యెదురుగా వున్న యింటికేసి చూశాడు. శారద యెక్కడా అగుపించలేదు. ఎదురుగా వచ్చి నవ్వుతూ ఆహ్వానిస్తుందనుకున్న శారద కనిపించక పోయేసరికి కాస్త నిరుత్సాహ పడ్డాడు,

"అలా నిల్చుండిపోయావేమిటోయ్.... పద లోపలికి...."అన్నాడు గంగాధర్రావు.

ఇద్దరూ లోపలికి నడిచారు. "శారద అగుపించదేమండీ?" ప్రశ్నించాడు ప్రకాశం. "లోపల ముస్తాబవుతుందేమో! నువ్వొస్తున్నావనగానే దాని వుత్సాహానికి పరిధుల్లేవు. వచ్చేస్తుంది....కూర్చో" చిరునవ్వుతో అంటూ కూతురి గదిలోకి పోయాడు,

గంగాధరరావు, కూతుర్ని దిగులు స్థితిలో చూసి విస్తుపోయాడు,

"అదేమిటమ్మా అలా వున్నావ్? ప్రకాశంవచ్చాడు....లే.... కాస్త మొహం తుడుచుకో! అతడు వచ్చినందుకు సంతోషించక, యెందుకలా దిగులుగా వున్నావ్, నాకు బోధపడ్డంలేదు" అన్నాడు,

"కొద్దిగా తలనొప్పిగా వుందినాన్నా!" అంది లేస్తూ....

ఆమె మొహం తుడుచుకుని పౌడరు రాసుకున్నంతవరకూ గంగాధర్రావు అక్కడే వున్నాడు.

సోఫా కూచున్న ప్రకాశం, చుట్టూలో ఓమారు కలయజూశాడు. ఇంట్లో చెప్పుకోదగ్గ మార్పుయేమీ జరుగలేదు. గంగాధర్రావు అన్న మాటలు ఓమారు నెమరు వేసుకున్నాడు. తను వస్తున్నానని తెలిసిందగ్గర్నించీ, శారద నిజంగా ఆనందాంబుధిలో తేలుతూ వుంటుంది. తనని యెప్పుడు చూస్తానా, అన్న తహతహతో ఎదురు చూస్తుందేమో!....

ప్రకాశం ఆలోచనలకు సడన్‌బ్రేకులు వేశాయి. వినిపించిన పదధ్వని. అటు వేపుగాచూశాడు ఆసక్తితో, గంగాధర్రావు, అతని వెనుక శారద, వచ్చారు. ఆశించినంతగా శారద ముస్తాబు కాకపోవడం, ప్రకాశంకి యేమీ అర్థంకాలేదు. కాస్తంత నిరుత్సాహ పడ్డాడు కూడాను.

"హలో ప్రకాశం" అంది శారద కృత్రిమమైన చిరునవ్వు పెదాలపై అందిస్తూ.

"ఏమిటి శారదా, అలా నీరసంగా అగుపిస్తున్నావేం?" అన్నాడు.

"ఏమీలేదు.... కొద్దిగా తలనొప్పిగా వుందంతే!" అంటూ యెదురుగావున్న కుర్చీలో కూచుంది శారద.

"మీరిద్దరూ మాట్లాడుతూ వుండండి.... కాఫీ పంపిస్తాను" అంటూ లోపలికి పోయాడు గంగాధర్రావు.

వాళ్ళిద్దరికీ స్వేచ్ఛ యివ్వాలన్న వుద్దేశమే గంగాధర్రావు అక్కణ్ణించివెళ్ళిపోవడంలోని అంతరార్థం, అతని మనస్తత్వం అదో తరహా అయినది. ప్రకాశం మీద అతనికి వల్లమాలిన అభిమానం, చదువూ, సంస్కారం, హోదా, వీటన్నింటికీ మించి ఐశ్వర్యం, వున్న ప్రకాశం, అతనికి అల్లుడౌతాడుకదా అన్న తహతహ, అతనిలో యేనాటినుండో స్థావరం యేర్పర్చుకుంది.

"అలా మౌనంగా కూచోపోతే, యేమైనా కబుర్లు చెప్పకూడదా శారదా! రెండేళ్ళ తర్వాత కల్సుకున్నాం.... కబుర్లేమీ లేకుండాపోవు'' అన్నాడు ప్రకాశం సన్నగా నవ్వుతూ.

"ఏం కబుర్లున్నాయి ప్రకాశం! మామూలే! నేనెక్కడికైనా తిరుగుతాను గనుకనా, కబుర్లు సేకరించడానికి! ఈ మధ్య యేమీ వుబుసుపోకుండావుంటేనూ, బొమ్మలు వెయ్యడం నేర్చుకుంటున్నాను" అంది యేమీ చెప్పకపోతే బావుండదని.

ప్రకాశం వుత్సాహంగా మందహాసం చేశాడు.

"అలాగా! అవుతే మంచిదే! ఆ అందమైన చేతుల్లో కుంచెకదుల్తూ వుంటే, అతి మనోహరమైన, సుందరమైనచిత్రాలు తయారవుతాయన్న మాటే!"

శారద పేలవంగా నవ్వింది. ఇంకేమీ జవాబు చెప్పడానికి, ఆమె మనసు అంగీకరించలేదు.

(తరువాయి 28 వ పేజీలో)

# ★ ఎదురుదెబ్బ ★

(17 వ పేజీ తరువాయి)

"నాలో యేమైనా మార్పు వచ్చిందంటావా శారదా ?" అన్నాడు ప్రకాశం ఆమె నుంచి ప్రశ్నించుకున్నప్పటికీ, తనే, నాంది గీతం పాడుతూ.

శారద అతని మొహంలోకి అదోలా చూసింది

"మొదట వుండేసౌకుమార్యం.మార్దవం మాయమై నీ మొహంలో యిప్పుడు హాస్తంలత కరకుదనం తొంగి చూస్తోంది ప్రకాశం" అంది మందహాసంగా.

ప్రకాశం షాక్ తిన్నట్టు ఫీలయ్యాడు ఆమె నుండి అతను ఆశించింది ఆ జవాబు కాదు. ఎంతో అందంగా మారాడనీ, మాటల్లో మార్దవం, చూపుల్లో చిలిపిదనం, ఛాయలో మెరుపు ధనం వచ్చాయనీ. యిలాగే యేవో అంటుందను కున్నాడు గాని, కుండ బద్దలు కొట్టినట్టు యీ విన మైన జవాబిస్తుందని వూహించలేక పోయ్యాడు.

"ఈ మాట నీ ఒక్కతే నోటనే విన్నాను శారదా !" మనసులో బాధపడు తున్నా తన అభివ్యక్తత కాపాడుకుందుకు ప్రత్రిమంగా నవ్వుతూ అన్నాడు.

"ఏమో, నా కళ్లకి కనిపించినట్టు చెప్పాను. నువ్వు కోపం తెచ్చుకుంటే యెలా !" అంది మెల్లగా.

ప్రకాశం మనసు చివుక్కుమంది. ఆమె ధోరణి యేమీ అంతుబట్టకుండా వుంది ఏనాడూ, ఆమె అంత ముభావంగా తనతో మాట్లాడలేదు. వంట్లో బాగులేక అలా వుందేమో ! అనుకున్నాడు.

వంటవాడు కాఫీ తెచ్చాడు. అతని వెంట గంగాధరావు వచ్చారు. శారద కాఫీని తనకి అందిస్తుందని యెదురు చూశాడు ప్రకాశం. కాని వంటవాడే అందించడంతో, ప్రకాశం కృంగి పోయాడు.

"వంట్లో అదోలా వుంది ప్రకాశం.. వస్తా ." అంటూ లేచి వెళ్ళి పోయింది.

ప్రకాశం తెల్లబోయి, ఆమె వెళ్తున్న వేపే చూస్తూ వుండి పోయాడు

"అమ్మాయి ఆరోగ్యం యీ మధ్య కాస్తంత దెబ్బతిన్నదిలే'' అన్నాడు గంగాధరరావు. ప్రకాశం మాత్రం యేమీ మాట్లాడలేదు, మళ్ళీ గంగాధరరావే ప్రారంభించాడు.

"మీ నాన్న యెప్పుడైనా మమ్మల్ని జ్ఞప్తికి తెచ్చుకుంటాడా ?" అన్నాడు గంగాధరరావు.

"నేనీమధ్య లేనుకదండీ అదెలా నేను చెప్పగల్ను ? నేనొచ్చాక మాత్రం రెండు మూడుసార్లు మీ విషయం మాట్లాడారు.." అన్నాడు ప్రకాశం.

"నేనంటే మీ నాన్నకి యెంతో అభిమానంలే ! ఈనాటి మిత్రులమా ? చిన్నప్పట్నుంచీ ఒకరి దగ్గర చదువుకున్నాం.... పైగా బంధుత్వంకూడా వుందాయె. ఇక ఒక్కటే నా వాంఛితం. శారదని నీ చేతుల్లో పెట్టేస్తే, మన బంధుత్వం విడివడని అనుబంధమౌతుంది. మీ నాన్న అభిప్రాయం కూడా అదేనూ," అన్నాడు గంగాధరావు. చిన్నగా నవ్వుతూ,

ప్రకాశం తనలో నవ్వుకున్నాడు. ఏమీ జవాబు చెప్పకుండా వూరుకున్నాడు. ప్రకాశం సిగ్గుపడుతున్నాడని భావించాడు గంగాధరావు.

ఆ రోజంతా ప్రకాశం గంగాధరావు యింట్లోనే వున్నాడు. మధ్యాహ్నం భోజనాలదగ్గర అందరూ కూచున్నప్పుడు, శారదని నవ్వించాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు. ఆరోగ్యం బాగులేకనే, శారద అలా వుందనుకున్నాడు. ఆ రోజంతా అక్కడ వున్నా శారద కావాలనుకుని యెప్పుడూ స్వయంగావచ్చి మాటాడలేదు అన్నింటికీ అతను సమాధానపడదిఒక్కటే! ఆమె వంట్లో బాగులేదు.

ఆరోజు రాత్రి బండికే వెళ్ళిపోవాలని నిశ్చయించు కున్నాడు ప్రకాశం. గంగాధరావు మరో రోజు వుండమని బలవంత పెట్టాడు గాని, శారద యేమీ అనక పోవడం, విచిత్రంగానే తోచిందతనికి' సాయంత్రం అయిదున్నర దాటింది. ఉన్న ఆ కొద్ది గంటలూ హుషారుగా గడపాలను కుని మస్తుగా ముస్తాబయ్యాడు. గదిలోంచి వెలికి వచ్చేసరికి, అప్సరసలా అలంకరించుకున్న శారద వంటగదివేపు పోతుండటం చూశాడు.

ప్రకాశంలోని వుత్సాహం పరవళ్ళు తొక్కింది శారద మనస్తత్వాన్ని చదువుకోలేక సతమతమయ్యాడు. తనకి మరింత అందంగా. ఆకర్షణీయంగా అగుపించడానికే, శారద అలా ముస్తాబయ్యిందని మనసులో అనుకున్నాడు. ఆమెను తీసుకుని అలా పార్కుకి వెళ్తే యెంత ఆనందంగా వుంటుంది ! మళ్ళీ గతాను భూతులు స్మృతి పథానికి రావూ ?.. అనుకున్నాడు.

'శారదా !' ఆప్యాయంగా పిల్చాడు.

శారద వయ్యారంగా వెనక్కి తిరిగింది. ఆమె మొహంలో ప్రసన్నతలేదు. చూపుల్లో చల్లదనం లేదు. పెదవులు ముడుచుకు పోయి వున్నయ్.

'ఏం ప్రకాశం !' అంది అక్కడ నుంచునే.

'అలా పార్కుకి వెళ్దాం రాకూడదూ?' అన్నాడు చిరునవ్వుతో.

''నేనిప్పుడు రాలేను ప్రకాశం....', అంటూ వంటగదిలోకి పోయింది.

తలమీద పిడుగుపడ్డట్టుగా ఫీలయ్యాడు ప్రకాశం. శారద విముఖతకి కారణం వూహించుకోలేక పోయాడు. మరి, ఆమె యెందుకు ముస్తాబయ్యిందో అర్థం చేసుకోలేక పోయాడు వికలమైన మనస్సుతో బయటికి నడిచాడు. సరిగ్గా ద్వారం దగ్గరే ఓ యువకుడు యెదురయ్యాడు సన్నగా. పొడుగ్గా, హుందాగా సూటులో వున్నాడు. తెల్లని షర్టుమీద ఆకుపచ్చని "టై" మెరుస్తోంది.

ఇద్దరూ వింతగా. ఆశ్చర్యంతో ఒకరి నొకరు చూసుకున్నారు. ఇద్దరి కను

బొమలూ అప్రయత్నంగా ముడివడ్డాయి. ఆ అపరిచిత వ్యక్తిని గురించి తెలుసుకోవాలన్న వాంఛ ప్రకాశంలో రేగినా, దాన్ని మనసులోనే మరుగుపర్చుకుని, గంభీరంగా వూరుకుండి పోయాడు ఆ కొత్త వ్యక్తిమాత్రం చొరవతీసుకుని తన విశాల హృదయాన్ని వ్యక్తం చేసుకున్నాడు.

"నా పేరు శ్రీనివాసమూర్తి.... శారద స్నేహితుణ్ణి...." అని పరిచయం చేసుకున్నాడతను.

శారద మార్పుకి కారణం. ప్రవర్తనలోని అంతరార్థం, అన్నీ అవగాహన చేసుకున్నాడు ప్రకాశం. తనని మోసగించిన శారదమీద, చెప్పలేనంత కోపం వచ్చిందతనికి, ఆమె కపట ప్రవర్తనను అసహ్యించుకున్నాడు.

''మిమ్మల్ని కలుసుకున్నందుకు చాల సంతోషం, నాపేరు ప్రకాశం...." అన్నాడు షేక్హేండు యిస్తూ.

''ఓ! మీరేనా ప్రకాశంగారు! ఐ. సీ.... మీ గురించి శారద చెప్తుంటుంది..... రండి లోపలికి.... కాస్సేపు కూచుని మాట్లాడుకుందాం...." అన్నాడు శ్రీనివాసమూర్తి.

కాని, ప్రకాశంకి లోపలికి వెళ్ళడానికి యిష్టంలేదు. వాళ్ళిద్దరూ సరదాగా, వుత్సాహంగా మాట్లాడుకుంటూ నవ్వుకుంటుంటే తను చూడలేడు గాయపడిన తన హృదయాన్ని రగల్చడం యిష్టంలేదతనికి.

"క్షమించండి.... ఓ స్నేహితుడ్ని కలవాలని వెళ్తున్నాను. మాట్లాడుతుండండి.. యిప్పుడే వచ్చేస్తాను." అంటూ వీధిలోకి దారి తీసాడు ప్రకాశం,

శ్రీనివాసమూర్తి లోపలి గదిలోకి అడుగుపెట్టే సరికి

'ఏమిటండీ, యింత ఆలస్యం చేశారు?' అంటూ మందహాసంతో యెదురుగా వచ్చింది శారద....

శ్రీనివాసమూర్తి మెల్లగా నవ్వేడు. "ప్రకాశంగారు వచ్చినట్టుంది?" అన్నాడు. శారద, మొహం సీరియస్‌గా పెట్టింది.

"ఆ! వచ్చాడు నన్నాకర్షించడానికి నానా అవస్థలూ పడుతున్నాడు...." అంది అసహ్యంతో కూడిన నిర్లక్ష్యాన్ని వ్యక్తం చేస్తూ.

శ్రీనివాసమూర్తి కళ్లు సగర్వంగా మెరిశాయి.

ఆ ప్రసక్తి పొడిగించకుండా, మరో టాపిక్‌లోకి మార్చేసింది శారద.

ఆ రాత్రి బండికే ప్రకాశం వెళ్లిపోయాడు.

* * *

ప్రకాశం వెళ్ళిపోయిన మూడోరోజు శారదకి ఓ ఉత్తరం వచ్చింది. కవరు మీది యెడ్రసుని బట్టి అది ప్రకాశం రాసిందేనని అర్థం చేసుకొంది. కవరు విప్పింది. .... ఉత్తరం చిన్నదే.

"ప్రియమైన శారదకు—

నిన్ను చూడాలని యెంతో వుత్సాహంతో, వుప్పొంగే ప్రేమానురాగాలతో వచ్చాను. నువ్వు నన్ను ఆత్మీయంగా చిరునవ్వుతో ఆహ్వానిస్తావని వువ్విళ్ళూరాను. కాని... కాని.... నా ఆశలన్నీ మట్టి గొట్టుకు పోయాయి. నీ మనస్తత్వాన్ని చాలా ఆలస్యంగా అర్థం చేసుకున్నాను. క్షణక్షణముల జవరాండ్ర చిత్తముల" అన్న లోకోక్తిని నువ్వు సార్థకం చేశావు. నాలో నిబిడీకృతమైవున్న బాధను, వుత్తరంద్వారా వ్యక్తం చెయ్యదల్చుకోలేదు శుభలేఖ కోసం యెదురుచూస్తుంటా.

నీ ఆనందంకోరే మిత్రుడు
ప్రకాశం

నవ్వుకుంది శారద. ఆమెలో అనుమాత్రమైనా బాధజనించలేదు నిర్లక్ష్యంగా వుత్తరాన్ని మడిచి కవరులో పెట్టేసింది....

♦ ♦ ♦

శారద, శ్రీనివాసమూర్తుల పరిణయం ఓ రూపానికి వచ్చింది శ్రీ వాసమూర్తి పేరు చెబితేనే శారద పిచ్చెత్తి పోతుంది. తమ వివాహప్రసక్తి ఆయనతో ప్రసంగించాలన్న తలంపుతో వున్న శారదకి శ్రీనివాసమూర్తి దగ్గర్నించి వుత్తరం వచ్చింది.

My dear శారదా.

మూడు రోజుల్నించి నీకు కనిపించక పోవటానికి కారణం నేను అకస్మాత్తుగా బెజవాడ వెళ్లడమే నువ్వు అన్యథా భావించకు. నేను యిక్కడికి వచ్చాక పరిస్థితులు వకించాయి. ఈ విషయం నీకు తెలియజేయడానికే కష్టమనిపిస్తోంది. కాని.... యేం చెయ్యను? తెలియజెయ్యాలి. నా వివాహం ఈ నెల యిరవయ్యో తేదీన నిశ్చయింప బడింది.... నువ్వు తప్పకుండా రావాలి...." అంత వరకూ చదివిన శారద మొదలు తెగిన మానులా మంచంపై ఒరిగిపోయింది. ఆమె గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఆపాద మస్తకం వణికిపోయింది. ఆవేదనంతా ఉక్రోషంగా రూపొందింది. ఆ వుత్తరాన్నింక చదవాలనిపించలేదు.

"రాస్కెల్, మోసగించాడు.." అనుకుంటూ వుద్వేగంతో ఉత్తరాన్ని ముక్కముక్కలు చేసింది.... ఆమె కోపం చల్లారలేదు.... కాని, యేం చేస్తుంది? పళ్లు పట కొరుక్కుంది....

శారదకి యిప్పుడు ప్రకాశం గుర్తొచ్చాడు.... ఆమెకి యేడుపొచ్చింది. కళ్లల్లో నీరు గిర్రున తిరిగింది తనని మనసారా ప్రేమించి పూజించే ప్రకాశాన్ని చేజేతులా వదులుకుంది.... ప్రేమ తిరస్కరించబడితే యెల్లాంటి అనుభూతి కలుగుతుందో, ఆమె యిప్పుడర్థం చేసుకుంది తను ప్రకాశంకి చాలా అన్యాయానికి తగిన శిక్ష లేదు.... ప్రకాశం తనని క్షమిస్తాడా? ఛీ! తనకింకా యెందుకా ఆశ? తను క్షమార్హురాలు కాదు. ప్రకాశం దృష్టిలో తను వంచకి? అతణ్ణి తలంచుకొందుకైనా తనకి అర్హత లేదు.... అనుకుంటూ లోలోన కుమిలిపోయింది.... ధారావాహినిగా స్రవించిన కన్నీరు తలదిండును తడిపేసింది.... అలా యెంతసేపు యేడ్చిందో ఆమెకే తెలీదు.... మగతనిద్ర పట్టేసింది....

—:O:—